రూ.5 లక్షలకు ఇల్లు సాధ్యమేనా?

- భారీగా పెరిగిన సిమెంటు, ఐరన్ ధరలు
- తడిసిమోపెడవుతున్న అదనపు వ్యయాలు
- పరిధి దాటుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ ఖర్చు



ఓ దుకాణంలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న ఐరన్.

పినపాక: పేదలు, నిరుపేదలు ఇల్లు కట్టుకోవడం ఒక కల. కానీ పెరుగుతున్న సిమెంటు, ఐరన్ ధరలకు ఇంటి కల, కలగానే మిగిలిపోతోంది. ఇంటి నిర్మాణం చేపట్టే మొదలు పూర్తి చేసే వరకు ఉపయోగించే సిమెంటు, ఐరన్, ఇటుక, కంకర వంటి అన్ని వస్తువుల రేట్లు పెరగడం వల్ల నిరుపేదలు ఇల్లు కట్టుకోవాలనే ఆశలు ఆవిరవుతున్నాయి.

రూ.ఐదు లక్షల దాటుతున్న ఖర్చులు..

ప్రభుత్వం నిరుపేద కుటుంబం వారు సొంతింటి కల సహకారం చేసేందుకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసింది. గ్రామాల్లో ఇల్లు లేని పేదలు ఇల్లు కట్టుకోవడానికి ఐదు లక్షల రూపాయలు ప్రభుత్వం మంజూరు చేస్తోంది. ప్రభుత్వ నిబంధనల మేరకు ఇల్లు కట్టుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. ఇంతవరకు బాగానే ఉన్నా ఆ డబ్బులకు ఇల్లు నిర్మించుకోవడం సాధ్యమేనా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రతి ఒక్కరికీ అదనంగా రెండు నుంచి మూడు లక్షల వరకు వెచ్చించాల్సి వస్తుంది.

పెరిగిన ధరలే కారణం..

రాష్ట్రంలో సిమెంటు, ఐరన్ ధరలు భారీగా పెరిగాయి. గతంలో 280 ఉన్న సిమెంట్ ధర ప్రస్తుతం మార్కెట్లో 330 నుంచి 380 వరకు పెరిగింది. అలాగే ఐరన్ టన్ను రూ.55,000 నుంచి 65,000 వరకు ధరలు పెరిగాయి. నిర్మాణానికి సంబంధించి ఎలక్ట్రికల్ వస్తువులు, కలప, ఇసుక, కంకర అన్ని ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ఈ చొప్పున ప్రభుత్వం అంచనా వేసిన రూ.5లక్షల వ్యయం ఇంటి నిర్మాణ కూలీలు, సిమెంట్, ఐరన్, ఇటుక, కంకరకే సరిపోతుంది. ఇవి కాకుండా ఇసుక, పెయింట్స్, గుమ్మాలు, కిటికీలు, ఎలక్ట్రికల్ సామాన్లు, వాటర్ సామాన్లు వంటివి అదనంగా ఖర్చవుతుంది. అంటే, రూ.5లక్షలతో నిర్మాణం పూర్తిచేయడం సాధ్యపడదని స్పష్టమౌతోంది.

అమలు కాని లోకాస్ట్ సిమెంట్, ఐరన్..

ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లకు తక్కువ ధరకు సిమెంటు, ఐరన్ పంపిణీ చేస్తామని తెలిపింది. కానీ అది పేపర్లకు పరిమితం అయింది. అన్ని గ్రామ పంచాయతీల్లోఇప్పటికే ఇల్లు ప్రారంభించారు. అధికారులు ప్రభుత్వం దష్టికి తీసుకువెళ్లి తక్కువ ధరకు సిమెంటు, ఐరన్ పంపిణీ చేస్తే లబ్ధిదారులు కొంత ఊపిరి పీల్చుకుంటారు.

నిర్మాణ వ్యయం పెరుగుతోంది..

ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకోవడానికి కూలి రేట్లు, సిమెంటు, ఐరన్ రేట్ల భారీగా పెరిగాయి. ప్రభుత్వం ఇచ్చిన దానితోపాటు లక్ష రూపాయల నుంచి 2 లక్షల వరకు అదనంగా చెల్లించాల్సి వస్తుంది. ప్రభుత్వం స్పందించి ఇందిరమ్మ లబ్ధిదారులకు సిమెంటు, ఐరన్ ప్రభుత్వ రేట్లకు ఇచ్చే విధంగా చూడాలి.

– రామరాజు, మణుగూరు

చర్చలు జరుపుతాం..

ఇందిరమ్మ ఇల్లు కట్టడానికి మేస్త్రులు ఎక్కువ మొత్తంలో డబ్బులు తీసుకుంటున్నారన్న సమాచారం అందింది. మేస్త్రుదరినీ పిలిచి చర్చించి అందరికీ అణువుగా ఉండే రేట్లను సూచించి లబ్ధిదారులకు న్యాయం చేస్తాం. పై అధికారులతో మాట్లాడి ప్రభుత్వ రేటుకు సిమెంటు, ఐరన్ ఇచ్చేందుకు చర్యలు చేపడతాం.

– ఎంపీఓ వెంకటేశ్వరరావు, పినపాక

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి



చంద్రుగొండ: మొక్క నాటుతున్న డీఎస్పీ అబ్దుల్ రెహమాన్

మణుగూరురూరల్: విద్యార్థులు, యువత మాదక ద్రవ్యాలకు దూరంగా మణుగూరు డీఎస్పీ వంగ రవీందర్‌రెడ్డి సూచించారు. అంతర్జాతీయ మాదక ద్రవ్య దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న వారోత్సవాల్లో భాగంగా సోమవారం సమితిసింగారంలోని మణుగూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వాహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ.. గంజాయి వంటి మత్తు పదార్థలను యువత, విద్యార్థులు అలవాటు పడొద్దని, దానివల్ల జీవితాలు చీకటిమయం అవుతాయని తెలిపారు. అనంతరం పాఠశాల ఆవరణలో ఆయన మొక్క నాటారు. ఈ సదస్సులో మణుగూరు సీఐ పాటి నాగబాబు, ఎస్సై మేడ ప్రసాద్, పాఠశాల హెచ్‌ఎం నాగశ్రీ, పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చంద్రుగొండ: మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని డీఎస్పీ ఎస్‌కె.అబ్దుల్ రెహమాన్ విద్యార్థులకు సూచించారు. డ్రగ్స్ వ్యతిరేక వారోత్సవాల్లో భాగంగా చంద్రుగొండలోని కస్తూర్బగాంధీ విద్యాలయంలో సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్ని మాట్లాడారు. విద్యాబుద్ధులు క్రమశిక్షణగా నేర్చుకుని మంచి భవిష్యతి పొందాలని ఆయన సూచించారు. సమాజంలో జరగుతున్న అనర్థాలను ఆయన విద్యార్థులు వివరించారు. కార్యక్రమంలో జూలూరుపాడు సీఐ ఇంద్రసేనరెడ్డి, ఎస్‌ఐ శివరామకృష్ణ, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ కవిత, కాంగ్రెస్‌పా నాయకులు ఫజల్‌బక్ష్, సంకా శంకర్, ఇమ్రాన్, బుంగా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గుండాల: మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని కొమరారం ఎస్సై నాగుల్‌మీరా సూచించారు. మండలంలోని కాచనపల్లి మోడల్ స్పోర్ట్స్ స్కూల్‌లో సోమవారం మాదకద్రవ్యాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. నేటి యువత గంజాయి, ఇతర మత్తుపదార్థాలకు బానిసలై ఆరోగ్యాన్ని ఛిద్రం చేసుకుంటున్నారని గుర్తుచేశారు. అటువంటి అలవాట్లు కలిగి ఉన్న వారికి దూరంగా ఉంటూ మంచి స్నేహితులను మాత్రమే ఎంపిక చేసుకోవాలని సూచించారు. అనంతరం పాఠశాల ఆవరణలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మినీ బ్యాంకులుగా తపాలా సేవలు

అశ్వారావుపేటరూరల్: పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని తపాలా కార్యాలయాల్లో మినీ బ్యాంకులుగా సేవలు అందిస్తున్నట్లు మణుగురు ఎస్‌డీఐపీ చింతల రామ్మూర్తి తెలిపారు. సోమవారం అశ్వారావుపేటలోని ఉపతపాల కార్యాలయంలో డీసీడీపీ(డాక్ కమ్యూనిటీ ప్రొగ్రాం) సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఇంటికీ తపాల పథకాలను అందుబాటులోకి తీసుకెళ్లాలని కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఎస్‌పీఎం సాయి, మెయిల్ ఓవర్‌సిర్ దుర్గాప్రసాద్, బ్రాంచ్ పోస్టు మాస్టర్లు, ఏబీపీఎంలు పాల్గొన్నారు.

ప్రజల అభివృద్ధే లక్ష్యం

కరకగూడెం: ప్రజలను అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనలో భాగస్వాములను చేయడమే తమ ముందున్న లక్ష్యమని కరకగూడెం ఎంపీడీఓ కుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన సోమవారం 'ధర్తి ఆబా జనభాగీదారి అభియాన్' కార్యక్రమంలో భాగంగా చిరుమళ్ల గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన గ్రామ సభలో పాల్గొని గ్రామ అభివృద్ధికి సంబంధించిన వివిధ అంశాలపై చర్చించారు. గ్రామంలో చేపట్టాల్సిన కొత్త పనులు,ప్రస్తుతం కొనసాగుతున్న పనుల పురోగతి, వాటి నాణ్యతపై అంశాలపై దృష్టి సారించారు. ఈ గ్రామ సభలో ఆధార్ నమోదు, సవరణలు, ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య బీమా కార్డు నమోదు తదితర సేవలకు గ్రామస్తులకు అందించామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రతాప్, పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు మందు

పినపాక: మండల పరిధిలోని గోపాలరావుపేట గ్రామంలో సోమవారం పినపాక వైద్యురాలు దుర్గాభవాని ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి దోమల మందు పిచికారీ చేశారు. దోమలను నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, చెత్తాచెదారం రోడ్లపై వేయవద్దని డాక్టర్ సూచించారు. అనంతరం తోగ్గుడెం గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. పంచాయతీ కార్యదర్శి, ఆశ వర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రాజకీయ శిక్షణా తరగతులు

భద్రాచలంఅర్బన్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో భద్రాచలం పట్టణంలో సీపీఎం సత్తా చాటాలని పార్టీ జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. రెండో రోజులపాటు జరిగిన సీపీఎం భద్రాచలం పట్టణ రాజకీయ శిక్షణ తరగతులు చందర్‌రావు భవన్‌లో జరిగాయి. ముందుగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబీ నర్సారెడ్డి పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి శిక్షణా తరగతులను ప్రారంభించారు. పార్టీ నిర్మాణం, పని పద్ధతులు అంశాన్ని మచ్చా వెంకటేశ్వర్లు బోధించగా, పార్టీ కార్యక్రమం అఖిలభారత మహాసభల తీర్మానాన్ని పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు ఏజే రమేష్ వివరించారు. ఈ సందర్భంగా మచ్చ వెంకటేశ్వర్లు, ఏజే రమేష్‌లు మాట్లాడుతూ.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజాక్షేత్రంలో ఎండగట్టాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, పార్టీ పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు ఎర్రంశెట్టి వెంకట రామారావు, సీతాలక్ష్మి పాల్గొన్నారు.

స్వచ్ఛ మిత్రలను నియమించాలి

భద్రాచలంటౌన్: భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల్లో స్వచ్ఛ మిత్రలను నియమించాలని పీఆర్‌టీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం పీఓ బి.రాహుల్‌కు వినతిపత్రం అందజేశారు. పీఓ స్వచ్ఛ మిత్రల నియామకానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.నరసయ్య, చింతపల్లి ప్రభాకర్ రావు, భాస్కర్ రావు, కళావతి, బానోత్ శ్రీనివాసరావు, ఈశ్వర్, రామారావు, చందు, మోహన్, రమేష్, శ్రీకాంత్, శ్రీరాములు, శీను తదితరులు పాల్గొన్నారు.

పాలాభిషేకం..

దమ్మపేట: రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమ చేసిన చేసిన సందర్భంగా దమ్మపేట విశాల సహకార పరపతి సంఘం కార్యాలయం స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు భట్టి, పొంగులేటి, తుమ్మల చిత్రపటాలకు సోమవారం పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే జారే మాటాడారు. మార్కెట్ కమిటీ చైర్మన్ వాసం రాణి, పామాయిల్ సలహాదారు కమిటీ సభ్యులు అలపాటి ప్రసాద్, సొసైటీ చైర్మన్ ఎల్లిన రాఘవరావు మండల కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బదిలీ సర్వీస్‌ను పరిగణనలోకి తీసుకోవాలి

బూర్గంపాడు: ఐటీసీ పీఎస్‌పీడీలో బదిలీ కార్మికుల గ్రాట్యూడిటీని లెక్కించేటప్పుడు వారి బదిలీ సర్వీస్‌ను కూడా పరిగణనలోకి తీసుకోవాలని ఐఎన్‌టీయూసీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గొనె రామారావు, యారం పిచ్చిరెడ్డిలు కోరారు. ఐటీసీ ఉన్నతాధికారులకు, గుర్తింపు కార్మిక సంఘ ప్రతినిధులకు సోమవారం వారు వినతిపత్రం అందించారు. ఐఎన్‌టీయూసీ నాయకులు పాల్గొన్నారు.

ఆస్పత్రుల్లో విస్తృత తనిఖీలు



భద్రాచలంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో తనిఖీ చేస్తున్న వైద్య ఆరోగ్యశాఖ అధికారులు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం వైద్య ఆరోగ్య శాఖ అధికారులు బృందాలుగా ఏర్పడి భద్రాచలంలో ఉన్న అన్ని ప్రైవేట్ ఆస్పత్రులతో పాటు ప్రైవేట్ రక్త పరీక్ష కేంద్రాలలో గడిచిన మూడు రోజులుగా విస్తృత తనిఖీ చేపడుతున్నారు. భద్రాచలం ఐటీడీఏ పీఓ రాహుల్ గత నెల 26న సాక్షిలో ప్రచురితమైన 'దేవుడా ఇదేం పరీక్ష'అనే కథనానికి స్పందించి.. భద్రాచలం ఐటీడీఏ పరిధిలో గల అన్ని ప్రైవేట్ ఆస్పత్రులు, రక్త పరీక్ష కేంద్రాల్లో వసూలు చేస్తున్న ధరలను తగ్గించేందుకు నిర్ణయించారు. ఇందుకు సంబంధించి జూన్ 5న పీఓ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే ఈ నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటిస్తున్నారా లేదా అని పరీక్షించేందుకు ప్రస్తుతం తనిఖీలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఇంకా పాత రేట్ల జాబితానే కనిపించిన వారికి మొదటి హెచ్చరికగా భావించి త్వరతగిన మార్పులు చేయాలని అధికారులు హెచ్చరించారు.

నాణ్యతతో పనులు కొనసాగించాలి

చర్ల: మిషన్ భగీరథ హైలెవల్ వాటర్ ట్యాంకు నిర్మాణ పనులను నాణ్యతతో చేపట్టాలని, త్వరితగతిన పనులు పూర్తి చేసి తాగునీటిని అందించేందుకు చర్యలు తీసుకోవాలని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు సూచించారు. మండలంలోని కలివేరులో రూ.35 లక్షల అంచనా వ్యయంతో నిర్మాణం చేయనున్న రూ.లక్ష కిలో లీటర్ల సామర్థ్యం కలిగిన హైలెవల్ వాటర్ ట్యాంకు నిర్మాణానికి సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ట్యాంకు నిర్మాణం పూర్తయితే కలవేరు గ్రామంలోని అన్ని కాలనీల్లో తాగు నీటి సమస్య పరిష్కారమవుతుందన్నారు.అనంతరం గ్రామంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలోఇళ్లు దగ్ధమయ్యి నిరాశ్రయులైన గిరిజనుడు కల్లూరి సమ్మచ్చ కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు. ఎమ్మెల్యే వెంట టీపీసీసీ సనరల్ సెక్రటరీ నల్లపు దుర్గాప్రసాదరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఇర్పా శ్రీను, చర్ల సహకార సంఘం అధ్యక్షుడు పరుచూరి రవి కుమార్, తహసీల్దార్ ఎం.శ్రీనివాస్, ఎంపీడీఓ ఈదయ్య, ఎంపీఓ వలీ, మిషన్ భగీరథ డీఈ (ఇంట్రా) బ్రహ్మదేవ్ ఇతర అధికారులు, నాయకులు పాల్గొన్నారు.



దుమ్ముగూడెం: ఆస్పత్రిలో పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ వెంకట్రావు

దుమ్ముగూడెం: రోగులకు మెరుగైన సేవలను వైద్యాధికారులు అందించాలని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు వైద్య సిబ్బందికి సూచించారు. సోమవారం మండలంలోని బండిరేవు గ్రామంలోని పర్ణశాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యశాలలో ఉన్న రోగులను పరామర్శించి వారితో ముచ్చటించారు. అనంతరం వారికి అందిస్తున్న వైద్య సేవల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పలు సూచనలు చేశారు. డాక్టర్ రేణుకారెడ్డి, వైద్య సిబ్బంది అమ్మాజీ, నాగేశ్వరరావు, సుజాత, సురేష్, కృపారాణి తదితరులు పాల్గొన్నారు.

ఈ నెల 26న డాక్ అదాలత్

చంద్రుగొండ: ఈ నెల 26వ తేదీన డాక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తపాలశాఖ అసిస్టెంట్ సూపరిండెంట్ చిన యాకయ్య సోమవారం ఒకప్రకటనలో తెలిపారు. తపాల వినియోగదారులకు సంబంధించిన ఫిర్యాదులు పర్చువల్ మోడ్‌లో ఆన్ లైన్ ద్వారా వినడానికి లింక్ ద్వారా ఫోన్ నెంబర్ పంపించడం జరుగుతుందన్నారు. తపాల సేవలకు సంబంధించిన ప్రజల ఫిర్యాదులు సూపరింటెండ్ ఆఫ్ పోస్ట్ ఆఫీస్‌కు పంపించాలన్నారు. మరింత సమాచారం కోసం సెల్ నంబర్ 8500960535ను సంప్రదించాల్సిందిగా ఆయన సూచించారు.

తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరణ

అశ్వాపురం: మండల నూతన తహసీల్దార్‌గా మణిధర్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మణిధర్ మాట్లాడుతూ.. మండల ప్రజలకు అందుబాటులో ఉంటూ.. పారదర్శంగా, మెరుగైన సేవలు అందిస్తామని అన్నారు.

సీపీఐ మండల కార్యదర్శిగా సురేష్

అశ్వాపురం: సీపీఐ నూతన మండల కార్యదర్శిగా మండల పరిధిలోని అమెర్ద గ్రామానికి చెందిన అనంతనేని సురేష్‌ను మరోసారి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కేంద్రంలోని ఎస్‌కేటీ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన మండల మహాసభలో సోమవారం నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. సీపీఐ పార్టీ మండల కార్యదర్శిగా అనంతనేని సురేష్, సహాయ కార్యదర్శులుగా వేల్పుల మల్లికార్జున్, ఎం.సురేందర్‌రెడ్డిని, 21 మంది కార్యవర్గ సభ్యులు, 60 మంది కౌన్సిల్ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

బస్ సర్వీస్ ప్రారంభం



బస్ సర్వీసును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

అశ్వారావుపేట: అశ్వారావుపేట–కావడిగుండ్ల ఆర్టీసీ బస్ సర్వీస్‌ను స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ సోమవారం ప్రారంభించారు. సుమారు 25 కిలోమీటర్ల మేర అధికారులు, కాంగ్రెస్ నాయకులు, ప్రయాణీకులతో కలిసి ఎమ్మెల్యే బస్‌లో కావడిగుండ్ల వరకు ప్రయాణించారు. మారుమూల గిరిజన గ్రామమైన కావడిగుండ్లకు బస్ సౌకర్యం ఏర్పాటు చేయడం ద్వారా మార్గంలోని పల్లెలకు రవాణా సౌకర్యం కలుగుతుందన్నారు. మరోవైపు, అశ్వారావుపేట మున్సిపాలిటీలో 100 రోజుల ప్రణాళిక పనులను సోమవారం ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పరిశీలించారు. పారిశుద్ధ్య పనుల్లో అలసత్వం వహించొద్దని సూచించారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు జూపల్లి రమేష్ బాబు, తుమ్మ రాంబాబు, మొగళ్లపు చెన్నకేశవరావు తదితరులున్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

మణుగూరురూరల్: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని డీసీహెచ్‌ఎస్ డాక్టర్ రవిబాబు సూచించారు. సోమవారం ఆయన మణుగూరు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని సందర్శించి పరిసరాలను పరిశీలించారు. అనంతరం వైద్యులు, సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలం దృష్ట్యా ప్రజలకు సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ఆస్పత్రికి వచ్చే రోగుల పట్ల వైద్యసిబ్బంది మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని సూచించారు. వైద్యసిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం చేయోదన్నారు. ఎవరైనా విధులను నిర్లక్ష్యం చేస్తే శాఖపరమైన చర్యలు తప్పవన్నారు. అనంతరం ఆస్పత్రి డాక్టర్ మూర్తి సాయి మోహన్‌ను ఆర్‌ఎంఓగా నియమిస్తూ నియామకపత్రాన్ని అందజేశారు. ఆర్‌ఎంఓగా నియమితులైన డాక్టర్ సాయిమోహన్‌కు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సునీల్, వైద్యులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమ్మె నోటీస్ అందజేత

భద్రాచలంఅర్బన్: దేశవ్యాప్తంతా జులై 9న జరిగే సార్వత్రిక సమ్మె నేపథ్యంలో సీఐటియూ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక గ్రామ దీపికలు వెలుగు కార్యాలయంలో ఏపీఎం జగదీష్‌కి సమ్మె నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎంబి.నర్సారెడ్డి మాట్లాడుతూ.. పని గంటలు పెంచుతూ.. కార్మికుల చట్టాలన్నీ రద్దుచేసి, నాలుగు కోడ్లను తీసుకొస్తున్న బీజేపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని, ఈ మేరకు దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ నాయకులు వైవీ రామారావు, రాంబాబు, గ్రామ దీపికల సంఘం జిల్లా నాయకులు చంద్రలీల, స్థానిక గ్రామ దీపికల సంఘం నాయకులు, సీతారత్నం, రమాదేవి, కామేశ్వరి, శ్యామల, సల్మా తదితరులు పాల్గొన్నారు.

సురక్షిత ప్రాంతాలకు తరలించాలి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న గ్రామస్తులు

మణుగూరుటౌన్: రాజుపేట, విఠల్‌రావు నగర్ గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం పట్టణంలో ఆయా గ్రామస్తులు ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ సెంటర్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించారు. తమ ప్రాణాలు కాపాడండి అంటూ నినాదాలు చేశారు. సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ గ్రామాలకు 50 మీటర్ల దూరంలోనే బ్లాస్టింగ్ జరుగుతోందని తెలిపారు. దీనివల్ల రాజుపేట, విఠల్‌రావునగర్ గ్రామాల్లో ఇళ్లు బీటలు వారుతున్నాయని, దుమ్ము, ధూళి పడి తాగునీరు కాలుష్యమవుతోందని తెలిపారు. శ్వాసకోశ వ్యాధులు వంటి అనారోగ్య బారిన పడుతున్నాట్లు వాపోయారు. మణుగూరు ఓసీ విస్తరణ జరిగితే ఈ మాత్రం కూడా ఇంట్లో ఉండలేని పరిస్థితి దాపురిస్తుందని, ఆ విస్తరణ జరగక ముందే విఠల్‌రావునగర్ గ్రామస్తులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని వేడుకున్నారు. ఈ మేరకు తహసీల్దార్ అద్దంకి నరేశ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామస్తులు బొజ్జా సదానందం, ఐతనబోయిన వెంకన్న, మందకృష్ణ, ఈర్ల రామకోటి, శ్రీకాకుళం, వీరమల్లు, వేల్పుల సుజాత, పుప్పాల అనిత, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

బంక్ నిర్మాణం అడ్డగింత

దమ్మపేట: మండల కేంద్రం దమ్మపేట గ్రామంలోని ఆర్‌టీసీ బస్ స్టేషన్ ప్రాంగణంలో నిర్మిస్తున్న పెట్రోల్ బంక్ నిర్మాణాన్ని గ్రామస్తులు సోమవారం అడ్డుకున్నారు. బస్ స్టేషన్ ప్రాంగణంలోకి బస్సులు వెళ్లకుండా బంక్ నిర్మాణాన్ని చేపడుతున్నారంటూ గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. అదే సమయంలో అక్కడికి చేరుకున్న సత్తుపల్లి ఆర్‌టీసీ డీఎం రాజ్యలక్ష్మి, స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ గ్రామస్తులను సముదాయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బంక్ నిర్మాణానికి సంబంధించిన డ్రాయింగ్‌ను పునఃపరిశీలించాలని డీఎంకు సూచించారు. స్టేషన్ లోపలకు బస్సులు వచ్చి వెళ్లే విధంగా నిర్మాణం చేపట్టేలా తగు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆదేశించారు.

మోదీ పాలనలో గుర్తింపు



దుమ్ముగూడెం: కరపత్రాలను విడుదల చేస్తున్న బీజేపీ శ్రేణులు

దుమ్ముగూడెం: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 11 ఏళ్ల పరిపాలనలో దేశానికి అంతర్జాతీయ గుర్తింపు లభించిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల బీజేపీ ఆధ్వర్యంలో పర్ణశాల గ్రామంలో నిర్వహించిన 'శక్తి కేంద్ర రచ్చబండ'కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కరపత్రాలు విడుదల చేశారు. పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కుంజా ధర్మ, జిల్లా ఉపాధ్యక్షుడు పసుమర్తి సతీష్,మండల అధ్యక్షుడు కంచ్రపు త్రినాద్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి కుందవరపు పవన్ కుమార్, మండల ఉపాధ్యక్షుడు కాగితాల త్రినాథ్ రెడ్డి, కమిటీ సభ్యుడు కాగితాల శ్యాము పాల్గొన్నారు.

నూతన పాలకవర్గ సభ్యులకు శిక్షణ

అశ్వారావుపేటరూరల్: గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ సెర్ప్ ఆధ్వర్యంలో గ్రామ సమాఖ్య ఆఫీస్ బేరర్స్‌కు సోమవారం శిక్షణనిచ్చారు. స్థానిక ఐకేపీ కార్యాలయంలో మూడు రోజులపాటు జరిగే ఈ శిక్షణా కార్యక్రమానికి స్టేట్ రిసోర్స్ పర్సన్‌లు ఎస్‌కె.సలీమా బేగం, బి.వెంకటేశ్వరమ్మ హాజరై.. నూతనంగా ఎంపికైన పాలకవర్గ సభ్యులకు వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా స్టేట్ రిసోర్స్ పర్సన్‌లు మాట్లాడుతూ.. నూతన పాలకవర్గం ద్వారా సంఘాలను బలోపేతం చేసేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం వెంకటేశ్వర రెడ్డి, ఐకేపీ సీసీలు పాల్గొన్నారు.

శ్యామ ప్రసాద్ ముఖర్జీకి నివాళి

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలో బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడారు. అనంతరం బీజేపీ నాయకులు పట్టణంలో పలు చోట్ల పర్యావరణ పరిరక్షణకు గుర్తుగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో కుంజా ధర్మ, పసుమర్తి సతీష్, నిడదవోలు నాగబాబు, ములిశెట్టి రాంమోహన్ రావు, కేశవ్, ములిశెట్టి నిఖిల్, కణితి నవీన్, వినోద్, రవి తదితరులు పాల్గొన్నారు.

ములకలపల్లి: భారతదేశపు అఖండత్వం కోసం బలిదానం చేసిన డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ చిరస్మరణీయుడని భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షుడు శంకర్ నాయక్ అన్నారు. ముఖర్జీ వర్ధంతిని మండల కేంద్రంలోని శిశుమందిర్ ఆవాస విద్యాలయంలో సోమవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. శిశు మందిర్ ఆవాస విద్యాలయం ప్రధానాచార్యులు కమల, నాయకులు అత్యం మణికంఠ సాయి, బాణోతు మల్లేష్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

డ్రైవర్ కుటుంబాన్ని ఆదుకోవాలి

భద్రాచలంటౌన్: భద్రాచలం ఐటీడీఏలో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వెంకటేశ్వరరావు కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని జిల్లా డ్రైవర్ల సంఘం కన్వీనర్ శ్రీనివాసరావు అన్నారు. స్థానిక ఐటీడీఏ క్యాటర్స్‌లో సోమవారం జరిగిన వెంకటేశ్వరరావు దశదిన కార్యక్రమానికి ఆయన హాజరై ప్రభుత్వ డ్రైవర్ల సంఘం తరుపున రూ.3 వేలు ఆర్థిక సహాయం కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో రాఘవులు, నాగరాజు, ఆమరనాథ్‌రావు, జానీ, వెంకటరామిరెడ్డి, ఆదినారాయణ, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల శ్రేయస్సే లక్ష్యం


మణుగూరుటౌన్: ఉపాధ్యాయుల శ్రేయస్సే లక్ష్యంగా పీఆర్‌టీయూ పనిచేస్తోందని జిల్లా నూతన అధ్యక్షుడు పూనెం నర్సయ్య, ప్రధాన కార్యదర్శి సీహెచ్.ప్రభాకర్ అన్నారు. సోమవారం మణుగూరులో జరిగిన పినపాక, మణుగూరు, అశ్వాపురం, కరకగూడెం మండలాల అధ్యక్ష, కార్యదర్శుల సమావేశంలో వారు ఉపాధ్యాయుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా జిల్లా అసొసియేట్ అధ్యక్షుడు భాస్కర్, రవీందర్, జిల్లా మహిళా అసొసియేట్ అధ్యక్షురాలు కళావతి, ఆయా మండలాల నాయకులు ఈశ్వర్, రామారావు, శ్రీ రాములు, దేవేందర్, శ్రీనివాస్, శేఖర్, శ్రీకాంత్, కిషన్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో నిరసన


మున్సిపాలిటీలు, పంచాయతీల్లోని పేరుకుపోయిన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఆయా ప్రాంతాల్లోని మున్సిపాలిటీ, పంచాయతీ కార్యాలయాల వద్దకు ర్యాలీగా వెళ్లి అక్కడ ఆందోళనలు నిర్వహించారు. కార్యాలయ బాధ్యులకు వినతిపత్రాలు అందించారు. నాయకులు మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకపోవడంతో గ్రామాల్లో ఎక్కడి సమస్యలు అక్కడే పేరుకుపోయాయని అన్నారు. – సాక్షి నెట్‌వర్క్



మణుగూరురూరల్: కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



భద్రాచలంఅర్బన్: జీపీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బీఆర్‌ఎస్ శ్రేణులు



అశ్వారావుపేట: మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న నాయకులు